క్లుప్తంగా

సకాలంలో రుణాలు చెల్లించాలి



రికార్డులను పరిశీలిస్తున్న ఏపీఎం జగదీశ్వర్

కెరమెరి: తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని ఏపీఎం జగదీశ్వర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని గ్రామైఖ్య సంఘ మహిళల ఇళ్లకు వెళ్లి బకాయిల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎంత వరకు రుణాలు చెల్లించాలి, ఏ సంఘం క్రమ పద్ధతిలో పొదుపు చేస్తుంది. రికార్డులు ఎలా నమోదు చేస్తున్నారు అనే అంశాలను పరిశీలించారు. బ్యాంకు, స్త్రీనిధి నుంచి తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లిస్తున్న వారికి పావులా వడ్డీ వర్తిస్తుందన్నారు. ఆయన వెంట సీసీ ధన్‌రాజ్, సంజీవ్ ఉన్నారు.

ఆన్‌లైన్ ప్రక్రియ వేగవంతం చేయాలి



ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో

కెరమెరి: సమగ్ర కుటుంబ సర్వే ఆన్‌లైన్ ప్రక్రియను వేగవంతం చేయాలని డీఎల్‌పీవో ఉమర్ హుస్సేన్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో కొనసాగుతున్న ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలించారు. తప్పులు దొర్లకుండా చూడాలన్నారు. కంప్యూటర్ ఆపరేటర్లతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికి 64 శాతం ఆన్‌లైన్ పూర్తయిందన్నారు. ఆయన వెంట ఎంపీడీవో అంజద్‌పాషా, తహసీల్దార్ దత్తు ప్రసాద్, ఎంఈవో ఆడే ప్రకాశ్, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి



విద్యార్థులతో భోజనం చేస్తున్న ఎంపీడీవో

వాంకిడి: విద్యార్థినులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో మధ్యాహ్న భోజనం సమయంలో తనిఖీలు చేపట్టారు. వంట గది, సరుకులు, పరిసరాలు, హాస్టల్ గదులు పరిశీలించారు. స్టాక్ రిజిస్టార్, ఉపాధ్యాయ, విద్యార్థుల హాజరు రిజిస్టార్లు తనిఖీ చేశారు. పారిశుధ్యానికి ప్రాధాన్యతనిస్తూ, విద్యార్థుల ఆరోగ్యంగా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

భోజనంలో నాణ్యత పాటించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ కవిత

దహెగాం: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో జాగ్రత్తలు తీసుకోవాలని తహసీల్దార్ కవిత అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆశ్రమ పాఠశాల, కేజీబీవీ, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వంట చేసే ముందు వంట గదిని శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తాజా కూరగాయలతో వంట చేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంఈవో శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు చెక్కుల పంపిణీ

సిర్పూర్(టి): సిర్పూర్(టి) మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో మంగళవారం సిర్పూర్(టి) మండలంలోని లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. చెక్కుల పంపిణీ కార్యక్రమానికి సిర్పూర్(టి) ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, ఎమ్మెల్సీ దండె విఠల్‌లు హాజరవుతారని పేర్కొన్నారు.

రేపు చింతలమానెపల్లిలో..

చింతలమానెపల్లి: మండలంలోని కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు 4న చెక్కులు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ మునావర్ షరీఫ్ తెలిపారు. మండలంలోని బాలాజీ అనుకోడ రైతు వేదికలో నిర్వహించే కార్యక్రమానికి ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. లబ్ధిదారులు ఆధార్ కార్డు, ఖాతాబుక్ జిరాక్స్‌తో ఉదయం 10 గంటలకు హాజరు కావాలని కోరారు.

భయం.. భయం

గత నెల రోజులుగా ఉమ్మడి జిల్లా ప్రజల కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నది బెబ్బులి. నాలుగు రోజుల వ్యవధిలోనే ఇద్దరిపై దాడి చేసింది. గన్నారం గ్రామానికి చెందిన మోర్లె లక్ష్మి అనే మహిళపై దాడి చేసి హతమార్చిన బెబ్బులి మరుసటి రోజు సిర్పూర్(టి) మండలం దుబ్బగూడ గ్రామానికి చెందిన రైతు సురేశ్ అనే రైతుపై దాడి చేసి గాయపరిచింది. దీంతో గిరిజన గ్రామాల్లో పులి భయం మొదలైంది. బయటికి వెళ్లేందుకే రైతులు, పశువుల కాపరులు జంకుతున్నారు. – చింతలమానెపల్లి/కౌటాల/దహెగాం/వాంకిడి



చింతలమానెపల్లి: అవగాహన కల్పిస్తున్న ఎఫ్‌బీవో ప్రభాకర్

- పులివచ్చిందంటూ.. పుకార్లు
- చేలకు వెళ్లేందుకు జంకుతున్న కూలీలు, రైతులు
- ఇళ్ల వద్దే ఉండాలంటున్న అధికారులు

కూలీల్లో భయం..

ప్రస్తుతం పత్తి తీత, వరి కోతలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో వరుస పులి దాడి సంఘటనలు జరగడంతో పత్తి తీయడానికి కూలీలు జంకుతున్నారు. పత్తి తీస్తున్న క్రమంలో పత్తి చేలలో ఏ చిన్న చప్పుడు అయినా కూలీలు భయాందోళన చెందుతున్నారు.

పులి వదంతులు ఇలా..

- చింతలమానెపల్లి మండలంలోని రాళ్లగూడ సమీపంలో పులి వచ్చిందని పుకార్లు కలకలం సృష్టించాయి. పత్తి తీయడానికి వెళ్లిన కూలీలకు కనిపించిందంటూ.. చెప్పడంతో అటవీ అధికారులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించిన పులి ఆనవాళ్లు కనిపించ లేదు. వ్యవసాయ పొలాల్లో ఏ చిన్న చప్పుడు అయినా జంకుతున్నారు.
- చింతలమానెపల్లి మండలంలోని బాబాసాగర్ అర్కగూడ ప్రాజెక్టు సమీపంలో పనులు చేసుకుంటున్న రైతులు పులి వచ్చిందనే సమాచారంతో పరుగులు తీశారు. అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. అటవీ డిప్యూటీ రేంజ్ అధికారి హైమావతి, బీట్ అధికారి ప్రభాకర్‌లు వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులు అనుమానం వ్యక్తం చేసిన ప్రాంతాలను పరిశీలించారు.
- కౌటాల మండలం బోదంపల్లి సమీపంలో పులి సంచరిస్తుందని పుకార్లు రావడంతో పత్తి తీత, వరి కోత పనుల్లో ఉన్న రైతులు ఇళ్లకు పరుగులు తీశారు. అలాగే తాటిపల్లి సమీపంలో పులి సంచారిస్తుందని, నది ఒడ్డున పులి ఉన్నట్లు సోషల్ మీడియాలో ఫొటోలు వైరల్ అయ్యాయి. అటవీశాఖ అధికారులు ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించి, వదంతులేనని పేర్కొన్నారు.



వాంకిడి: ఆనవాళ్ల కోసం గాలిస్తున్న సిబ్బంది

- వాంకిడి మండలంలోని వివిధ గ్రామాల్లో పులి కనబడిందంటూ వచ్చిన వదంతులు ప్రజలను బెంబేలెత్తించాయి. మండల కేంద్రానికి సమీపంలోని చిన్న వాంకిడి శివారులో బోయిరె మారుతి అనే వ్యక్తి పులి కనిపించందని ఇంటికి పరుగెత్తుకుంటూ వచ్చాడు. లక్ష్మీపూర్, సోనాపూర్ గ్రామ శివారులో పత్తి ఏరుతున్న కొందరు పులిని చూశామంటూ.. అధికారులకు సమాచారం ఇచ్చారు.
- దహెగాం మండలంలోని రాళ్లగూడ సమీపంలో పులి వచ్చిందని పుకార్లు కలకలం సృష్టించాయి. పత్తి తీయడానికి వెళ్లిన కూలీలకు కనిపించిందంటూ.. పుకార్లు రావడంతో అటవీ అధికారులు ఘటన స్థలానికి చేరుకోని పరిశీలించగా పులి ఆనవాళ్లు కనిపించలేదు.

భయాందోళన వద్దు..



రైతులతో మాట్లాడుతున్న ఎస్సై ప్రవీణ్

బెజ్జూర్: బెజ్జూర్ రేంజ్ పరిధిలో పులులు సంచరిస్తున్నాయని, భయాందోళన చెందాల్సిన అవసరం లేదని, అప్రమత్తత అవసరమని బెజ్జూర్ ఎస్సై కె.ప్రవీణ్ కుమార్ అన్నారు. సోమవారం అటవీశాఖ అధికారులతో కలిసి మండలంలోని చిన్నసిద్దాపూర్ గ్రామంతో పాటు ఆయా గ్రామాల్లో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే అడవి సమీపంలోని పంట చేనులకు వెళ్లే కూలీలు, రైతులు మాస్కులు ధరించి గుంపులు గుంపులుగా, చప్పుడు చేస్తూ వెళ్లాలని సూచించారు. పులి జాడలు కనిపిస్తే అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఆయన వెంట సెక్షన్ ఆఫీసర్ మల్లికార్జున్, ఎఫ్‌బీవో వెంకటేశ్, అనిల్, అవినాష్ పాల్గొన్నారు.

దహెగాం: ప్రజలు ఎలాంటి అపోహలు నమ్మవద్దని ఎఫ్ఎస్‌వో సద్దాం అన్నారు. సోమవారం మండలంలోని రాళ్లగూడ సమీపంలో పులి సంచారం ఉందని అందిన సమాచారం మేరకు అటవీ అధికారులు వెళ్లి చూడగా పులి లేదని నిర్ధారించారు. అనంతరం కూలీలతో మాట్లాడారు. పులి కనిపిస్తే అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

పోస్టర్ ఆవిష్కరణ



ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్‌అర్బన్: సంతాజీ జగ్నడే మహరాజ్ జయంతి వేడుకల పోస్టర్ సోమవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ వెంకటేశ్ దోత్రే గాండ్ల తెలికుల సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్, బీజేపి నాయకులు అరిగెల నాగేశ్వర్‌రావ్, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్‌లతో వేర్వేరుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో అఖిల గాండ్ల తెలికుల సంఘం రాష్ట్ర యువజన అధ్యక్షుడు సందీప్, శ్రీనివాస్, ఆకాష్, మురళీక్రిష్ణ, సంతోష్, పోచన్న, ఆనంద్, దశరథ్, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల దినోత్సవం విజయవంతం చేయండి

ఆసిఫాబాద్‌అర్బన్: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటలకు నిర్వహించే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వీహెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇస్లాం బిన్ హసన్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలోని దివ్యాంగులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు.

రోడ్డు విస్తరణ చర్యలు చేపట్టాలి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని జాతీయ రహదారి అప్రోచ్ రోడ్‌ను విస్తరించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జాతీయ రహదారి నుంచి పట్టణంలోకి వచ్చే రహదారిపై తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటుండడంతో సోమవారం నేషనల్ హైవే మేనేజర్ రంజన్‌కుమార్, ఆర్డీవో లోకేశ్వర్ రావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జాతీయ రహదారి నుంచి పట్టణంలోకి వచ్చే రహదారిపై మూల మలుపులు ఉండడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. భారత్ పెట్రోల్‌పంప్ సమీపంలోని యూటర్న్‌ను మూసి వేయాలని నేషనల్ హైవే అధికారులను ఆదేశించారు. సాయిబాబా ఆలయం సమీపం నుంచి జాతీయ రహదారి వరకు అప్రోచ్‌రోడ్డుపై బీటీ వేయాలన్నారు. కలెక్టర్ వెంట డీఎస్పీ కరుణాకర్, మున్సిపల్ కమిషనర్ భుజంగరావు, పంచాయతీరాజ్ ఈఈ ప్రభాకర్ ఉన్నారు.



పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

సమస్యలు పరిష్కరించండి

ఆసిఫాబాద్‌అర్బన్: బీసీ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్‌నార్ రమేశ్ అన్నారు. సోమవారం కలెక్టర్ వెంకటేశ్ దోత్రేను బీసీ సంక్షేమ సంఘం నాయకులు మర్యాద పూర్వకంగా కలిసిశారు. పుష్పగుచ్ఛాన్ని అందజేసి, శాలువాతో సత్కరించారు. గురుకుల పాఠశాలలకు సొంత భవనాలను నిర్మించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గాజుల జక్కయ్య, లహుకుమార్, మారుతిపటేల్, శంకర్, రమేశ్ పాల్గొన్నారు.

సంస్థ పురోభివృద్ధికి కృషి చేయాలి

రెబ్బెన: పదోన్నతి పొందిన ఉద్యోగులు రెట్టింపు బాధ్యతతో విధుల నిర్వర్తించి సంస్థ పురోభివృద్ధికి కృషి చేయాలని ఖైరిగూడ మేనేజర్ శంకర్, ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి తిరుపతిలు అన్నారు. సోమవారం ఓసీపీలో ఎలక్ట్రికల్ ఫోర్‌మెన్‌గా పదోన్నతి పొందిన అంకుష్‌కు పదోన్నతి పత్రాలు అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మిక చట్టాల ప్రకారం ఉద్యోగులకు పదోన్నతులు అందుతున్నాయన్నారు. ప్రతిఒక్కరూ అంకితభావంతో విధులు నిర్వహిస్తూ సంస్థ పురోభివృద్ధికి పాటుపడాలని అన్నారు. వృత్తి నైపుణ్యాలను మెరుగుపర్చుకుంటూ ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్, డీవైపీఎం వేణు, ఎలక్ట్రికల్ ఫోర్‌మెన్ అంకుష్, సహాయ కార్యదర్శి ఓదెలు, సుధాకర్, కాసింఖాన్, లవరాజు పాల్గొన్నారు.



పదోన్నతి పత్రం అందజేస్తున్న నాయకులు



ధ్వజ స్తంభం వద్ద..

చల్లంగ చూడు తల్లి..!

కౌటాల మండల కేంద్రంలోని కంకలమ్మ గుట్ట (మేదరిగిరి)పై ఉన్న కంకలమ్మ- కేతేశ్వర స్వామి ఆలయ 20వ మహా జాతర మహోత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం భక్తులు వేలాదిగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. దీంతో ఆలయ ఆవరణంలో భక్తుల సందడి నెలకొంది. ఆలయ కమిటీ చైర్మన్ సుల్వ కనకయ్య- కల్యాణి ఆధ్వర్యంలో వేదపండితులు శివరాం స్వామి, ప్రకాశ్ సమక్షంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. జాతరలో ఏర్పాటు చేసిన పలు స్టాళ్లలో భక్తులు వస్తువులు కొంటూ సందడి చేశారు. – కౌటాల



మెట్ల దారిపై భక్తుల సందడి



కొబ్బరికాయలు కొడుతున్న భక్తులు



వెళ్లవస్తాం.. కంకలమ్మ తల్లి

పరిహారం అందజేత



పరిహారం అందజేస్తున్న అధికారులు

పెంచికల్‌పేట్: మండలంలోని దరోగపల్లి గ్రామానికి చెందిన వరిమండ్ల శ్రీనివాస్ గేదె ఆదివారం చిరుత పులి దాడిలో మృతి చెందగా.. బాధిత రైతుకు ఎఫ్ఆర్‌వో అనిల్ కుమార్ సోమవారం రూ. 5వేలు తక్షణ పరిహారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పులుల సంచారం నేపథ్యంలో పంట చేలకు వెళ్లే రైతులు, రైతు కూలీలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పంట చేలలోకి గుంపులుగా వెళ్లాలన్నారు. అంతకు ముందు పెంచికల్‌పేట్ ఎస్సై ఆధ్వర్యంలో గ్రామస్తులకు పులుల సంచారం నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

అయ్యప్ప మహాపడి పూజ



మహాపడి పూజలో పాల్గొన్న భక్తులు

రెబ్బెన: మండలంలోని దేవులగూడలో సోమవారం రాత్రి అయ్యప్ప స్వామి మహాపడి పూజ కార్యక్రమాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. గ్రామానికి చెందిన శ్రీనివాస్ స్వామి వారి పట్టెంబడి మహాపూజ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా.. గురుస్వామి మునునూరి సూర్య భాస్కర శర్మ, కిరణ్‌శర్మ వేదపండితుల మంత్రోచ్ఛరణ నడుమ పడిపూజ నిర్వహించారు. అయ్యప్ప మాలధారణ స్వాములు భక్తితో స్వామిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



అవగాహన కల్పిస్తున్న ఎఫ్ఆర్‌వో

కెరమెరి: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎఫ్ఆర్‌వో మజారోద్దీన్ అన్నారు. సోమవారం మండలంలోని ధనోరా గ్రామంలో అడవుల రక్షణ, పర్యావరణ ముప్పు, అటవీ జంతువుల సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. అడవుల సంరక్షణ అందరి బాధ్యతన్నారు. పట్టాలున్నంతనే వరకే సాగు చేయాలని, అధిక సాగు చేస్తే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. అక్రమ కలప తరలిస్తే సమాచారం ఇవ్వాలని, వణ్యప్రాణుల వేట చట్టరీత్యా నేరమన్నారు.

గురుకుల పాఠశాల ఎదుట ధర్నా



ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, కళాశాల గేటు ఎదుట సోమవారం బీఆర్ఎస్ నాయకులు ధర్నా చేపట్టారు. గురుకులాల్లో తనిఖీ కోసం వెళ్లిన నాయకులను పాఠశాలలోకి అనుమతించకపోవడంతో నిరసన వ్యక్తం చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ వైఖరి మార్చుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సిర్పూర్(టి) నియోజకవర్గ కన్వీనర్ లెండుగురే శ్యాంరావ్, అస్లాం, లక్ష్మణ్ పాల్గొన్నారు.

వేతనాల కోసం ఐక్యంగా పోరాడాలి

రెబ్బెన: సింగరేణిలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు దక్కే వరకు ఐక్యంగా పోరాడాలని సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం (టీబీజీకేఎస్) ఏరియా అధ్యక్షుడు అంబాల ఓదెలు అన్నారు. సోమవారం గోలేటి సీహెచ్‌పీలో కాంట్రాక్టు కార్మికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈనెల 4న గోలేటిలో నిర్వహించే కాంట్రాక్టు కార్మికుల మహాసభకు ఏరియాలోని కాంట్రాక్టు కార్మికులు అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెరగడం లేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే నెల రోజుల్లో సింగరేణి కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచుతామని ఓట్లు వేయించుకుని సీఎం రేవంత్ రెడ్డి వేతనాలు పెంచకుండా మర్చిపోయాడని ఆరోపించారు. మహాసభలకు కాంట్రాక్టు కార్మికులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.



మాట్లాడుతున్న అంబాలు ఓదెలు

వీఆర్ఏల వారసులకు ఉద్యోగాలివ్వాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న వీఆర్ఏలు

ఆసిఫాబాద్‌అర్బన్: జీవో 81 ప్రకారం 61 ఏళ్లు పైబడిన వీఆర్ఏల వారసులకు ఉద్యోగాలివ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ వెంకటేశ్ దోత్రేకు వినతిపత్రం ఇచ్చారు. స్వరూప, అజ్గర్‌అలీ, రజినీకాంత్, రాజయ్య, ప్రియాంక, అనిత, సతీష్ పాల్గొన్నారు.

ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలలు ఏర్పాటు చేయాలి

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో సాంకేతిక విద్యా సంస్థలు ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలలు ఏర్పాటు చేయాలని యువజన సంఘం నాయకులు కోరారు. సోమవారం యువజన సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ వెంకటేశ్ దోత్రేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యువజన సంఘం జిల్లా కన్వీనర్ రమేశ్ మాట్లాడుతూ.. జిల్లాలో సాంకేతిక సంస్థల కళాశాలు లేకపోవడంతో ఉన్నత చదువుల కోసం జిల్లా విద్యార్థులు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందన్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ జిల్లాకు పాలిటెక్నిక్ కళాశాల మంజూరు చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో నిరుద్యోగ జేఏసీ జిల్లా కన్వీనర్ ముజామిలుద్దిన్, హైమద్, తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వన్యప్రాణులను వేటాడితే కేసులు

లింగాపూర్: వన్యప్రాణులను వేటాడితే చట్టప్రకారం కేసులు నమోదు చేస్తామని జోడేఘాట్ రేంజ్ అధికారి జ్ఞానేశ్వర్, జైనూర్ సీఐ రమేశ్ అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో సోమవారం 'అడవిలో నిప్పు.. జీవాలకు ముప్పు' అనే అంశంపై అటవీశాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కలప అక్రమంగా తరలించినా, విద్యుత్ తీగలు అమర్చినా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై లింగన్న, ఇన్‌చార్జి ఎంపీవో రజినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు